# ఆపనమ్మకం

"మామయ్యా, రోజూ నీ ఆహ్వానం కోసం ఎదురు చూస్తూ నిస్పృహతో కుమిలిపోతున్నాను. ప్రతి సంవత్సరమూ రమ్మని ఉత్తరం రాసేవాడివి ఈసారి, నీవు హోటల్లో తింటూ కూడా ఎందుకు రాయలేదు. నీకు హోటలు తిండి ఎంత అయిష్టమో నే నెరుగనా? అందుకని ఈసారి వేసవి శలవులకు పిలవకుండానే వస్తున్నాను. రేపు రాత్రి బండికి వచ్చి పడతాను. ఉప్పూ, పప్పూ సిద్ధంగా ఉంచు. నేను వచ్చిన తరవాత మళ్ళా నీకు సావకాశం ఉండదు. ఈ లోపుగానే ఇల్లంతా అల్లరిగా చెయ్యి. (ఇల్లు పశువుల దొడ్డికింద చెయ్యటానికి నీ తరవాతే ఎవరన్నా!)

"నా పరీక్షలు రేపు సాయంకాలానికి అఖరు. అత్తయ్య కులాసాగా

తిరుగుతున్నట్టు ఉత్తరం వస్తున్నదా? ఆవిడ, పాపం, దురదృష్టవంతురాలు. అయిదు మోతలుమోసి ఒక్క పిల్లను కూడా చంకనెత్తుకోలేక పోయింది. నేను మొదటినుంచీ అంటూనే ఉన్నాను, ఆవిడకు మగపిల్లవాడు పుట్టితేకాని బతకడు. ఆ మాట అంటే నువు నవ్వుతావని తెలుసును. వట్టి నమ్మకంలేని మనిషివి. పైగా, ప్రతిదాన్నీ సందేహించటం వేదాంతమంటావు. ఒక మగపిల్లవాణ్ణి కని నాకిచ్చి పెళ్ళి చెయ్యవలసిన బాధ్యత ఇంకా నీ మీద ఉంది తెలుసునా?

—రాజ్యం."

ఒక్కొక్క మనిషి జీవితంలో పరిపూర్ణమయిన ఆనందమంటూ ఉండదు. నన్నెరిగిన వాళ్ళెవరూ తెలుసుకోలేరుగాని నేను అటువంటి మనిషిని. కించిత్తు ఆనందం కలిగించే అనుభవం ఏదైనా అందుబాటులోకి రాగానే నేను పని పెట్టుకుని ఆ ఆనందాన్ని భంగం చేసే అంశం ఏదైనా ఆ అనుభవం వెంట ఉందా అని వెతుకుతాను. సాధారణంగా ఉంటుంది. ఏదైనా రుచ్యమైన పదార్థం తినటానికి కూర్చోగానే అది వడదేమోనని భయం; ఎవరివైపైనా మనసు మొగ్గసాగితే మోసపోతానేమోనని భయం.

నాలో ఉన్న ఈ జబ్బు నే నెరిగినంత వరకు ఎవరూ కనిపెట్టలేదు. ఒక్క నా మేనగోడలు రాజ్యమే కనిపెట్టిందేమో ననిపించేది. "నువ్వు వట్టి అపనమ్మకం మనిషివి. నీలోనే నీకు నమ్మకం లేదు. కొన్ని విషయాల్లో అపనమ్మకం ఉంటే తప్పులేదు — మరికొన్ని విషయాల్లో మరింత నమ్మకం కుదిరేటందుకు! దేన్నీ నమ్మకుండా జీవితమంతా గడిపి ఏం బావుకుంటావు?" అని రాజ్యం నన్ను వేళాకోళం చేసేది. కాని, ఈ అపనమ్మకం నాకు ఆనందం లేకుండా చేస్తున్నదని దానికి తెలుసునో తెలియదో నే నెరుగను. తనే నా జీవితానికి ఒక బాధా, ఒక ఆనందమూ అయిన సంగతి రాజ్యం అసలెరిగి ఉండదు!

నాభార్య కాపరానికి వచ్చిన రెండోరోజున, నా ఇరవైఒకటో ఏట, రాజ్యం భూమిమీద వడ్డది. దానికి ఏడోఏడు వెళ్ళి ఎనిమిది వస్తుండగా మా చెల్లెలు పోయింది. రాజ్యం నా మేనగోడలనీ, రక్తస్పర్శ అనీ అప్పుడే నేను మొదటిసారి సమగ్రంగా భావించగలిగాను. అది తల్లిలేని పిల్ల అయేవరకూ దానికి నేను నా మానసిక ప్రపంచంలో ఎటువంటి స్థానమూ లేదు. నేను పిలవ గానే రాజ్యం చప్పున దగ్గిరికి వచ్చి నా ఒళ్ళో కూర్చుని నన్ను చిన్నతనంనించీ ఎరిగిన దాని మోస్తరుగా మాట్లాడుతుంటే నాకు భరించరాని బాధా, పశ్చాత్తాపమూ కలిగినై.

ఆ క్షణాన నాకు రాజ్యంమీద పుట్టుకొచ్చిన సహజమైన మమకారం చూసి నేనే భయపడ్డాను. తక్షణమే నేనా మమకారాన్ని నిగ్రహించుకున్నాను. నా జీవితమంతా నిగ్రహమే అయిపోయింది. ఎవరైనా నిగ్రహం సాధ్యంకాలేదని ఏడుస్తారు-నేను నాకది సాధ్యమయిందని ఏడవవదగిన దుస్థితిలో ఉన్నాను.

నేను మా బావమరిదికి సలహాకూడా ఇచ్చాను: 'నువు సాధ్యమైనంత త్వరలో మళ్ళీ పెళ్ళి చేసుకో. పిల్లను సవితితల్లి సరిగా చూడదనికాని, చూడ లేదంటారనికాని ఏమాత్రమూ భయపడకు. ముందు ముందు నీభార్య పిల్లను అలుసుచెయ్యకుండా కూడా చూడు. ఇటువంటి విషయాల్లో లోకాన్ని పాటించి లాభంలేదు.'

మా బావమరిది పెళ్ళి చేసుకున్నాడు. రాజ్యాన్ని సవతితల్లి సరిగా చూడలేదు. ఆవిడ అసూయ చూపించిందనీ, సవతితల్లితనం ప్రకటించిందనీ అందరిమాదిరిగా నిష్ఠురంవెయ్యటం నాకిష్టంలేదు. తల్లి పిల్లలను చూడటమే పెద్దకళ, సవితితల్లి సవితిపిల్లను సరిగా చూడటం మరింత కష్టసాధ్యమైన కళ. ఆ కళకు అవసరమైన శిల్పచాతుర్యం మా బావమరిది రెండో భార్యలో పూర్తిగా లోపించింది.

రాజ్యానికి జీవితం హాయిగా లేదని ఎవరన్నా చూచాయగా అన్నప్పుడు నా హృదయం చలించేది. కాని ఏదో సమాధానం చెప్పుకుంటే గాని నాకు తృప్తి కలిగేదికాదు. లోకం నోరు మంచిదికాదు. తల్లి పిల్లల్ని ఎంత హింసించినా గమనించరు. సవితితల్లి అవసరంగా కోప్పడ్డా గొల్లున గోలెత్తుతారు! రాజ్యం మాత్రం చిన్నతనంచేత అవివేకమైన పనులు చెయ్యదా?—ఈవిధంగా అనుకుని ఊరుకున్నాను.

పదో ఏట రాజ్యం పెళ్ళి అయింది. ఆ పదోయేటనే అది వితంతువు కూడా అయింది. వైధవ్యం సంప్రాప్తించిన ఒక నెలకే రాజ్యం నాకు మొదటి ఉత్తరం రాసింది. ఆ ఉత్తరంద్వారా నేను తెలుసుకోగలిగాను, రాజ్యం విషయంలో నా విధ్యుక్తధర్మం నేను నెరవేర్చలేదని, కొంత కాలంపాటు దాన్ని మా ఇంటో ఉంచుకుంటానని మా బావమరిదితో చెప్పి రాజ్యాన్ని తీసుకొచ్చేశాను.

దాని భావి జీవితం గురించి స్థూలనిర్ణయం చేసేశాను. దాన్ని వెంటనే ట్యూటరుకింద పెట్టి పై సంవత్సరం ఏ వస్తుపారంలోనో ప్రవేశపెట్టటమూ, కాల క్రమాన దానికి పునర్వివాహంచేసి దాని జీవితం సార్థకపరచటమూ.

రాజ్యం మాయింటికి వచ్చేవరకు నాకు పిల్లలమీద ఎంత వాంఛ వుండిందీ తెలిసివచ్చింది. దానికోసం గుడ్డలనీ, సబ్బులనీ, సూదులనీ అవనీ,

ఇవన్నీ విచారించటం నాకు కొత్త ఆనందం ఇచ్చింది. అది కొంతకాలం పాటు మా ఇంటో వుండిపోతుందనే ఆలోచనే నాకెంతో సంతోషం కలిగించింది. కాని, దాని వెనకాలే వచ్చింది ఆలోచన-రాజ్యంమీద ఇంత మమకారం పెట్టుకుంటే ఈ బంధం తెంచుకోవలిసి వచ్చేటప్పటికి ఎంత బాధపడతానోనని!

రాజ్యం రాకముందు నాభార్య కనబరిచిన నిర్లిప్తత చూచి నేను ఆశ్చర్య పడ్డాను. అది - అంటే నాభార్య - నాకన్న చాలా ఎక్కువగా కలవరించేది పిల్లలకోసం. అటువంటి మనిషి ఇంటో ఒక పిల్ల తిరుగుతుంటే ఎందుకు పరవశ మైపోదూ? అంటే నాభార్య రాజ్యాన్నిచూసి మొహం మాడ్చుకుందనికాదు, రాజ్యానికి వుపచారం చెయ్యటంలో నాభార్య కనవరచదగిన వుత్సాహం కన పరచకపోయింది. అంతకన్న వున్న సంగతి స్పష్టంగా చెప్పలేను.

మళ్ళీ రాజ్యమూ, నాభార్యా చాలా రాచకార్యాలు చేసుకునేవాళ్ళు. కలిసి పనిచేసేవాళ్ళు. ఎంతో బంధం వున్నట్లుండేవాళ్ళు. కాని నాతో మాట్లాడేటప్పుడు రాజ్యం గొంతులో మరొకధోరణి కనిపించేది. పైకి ఏమీ అనకుండానే ఆ పసి పిల్ల నామీద తనకున్న అభిమానం యొక్క ప్రత్యేకతను ప్రకటించేది.

రాజ్యం నా పనులన్నీ తనే చెయ్యసాగింది. అందుమూలంగా తన భారం చాలా తగ్గినందుకు నాభార్య సంతోషించింది. రాజ్యం అనేక పనులు నాభార్య కన్న బాగా చెయ్యగలిగినందుకు నేను సంతోషించాను. కాని ఈ సంతోషంతో బాటు అర్థంకాని బాధ కలిగేది.

రాజ్యం మా ఇంటికొచ్చిన కొత్తలోనే ఒక కోతిపని చేశాను. ఆపని చేసే దాకా అటువంటి పని చెయ్యగలనని నేనెన్నడూ భావించలేదు. ఆ తరవాత కూడా, నా జీవితమంతా సింహావలోకనం చేసుకుంటే నాకర్థం కాని అనేక విష యాల్లో ఇదికూడా ఒకటి అనిపిస్తుంది. అదేమిటంటే, నేను మా రాజ్యాన్ని నాభార్య చూడకుండా ముద్దుపెట్టుకున్నాను. నాకు నిజంగా పిల్లల్ని ముద్దుపెట్టు కునే అలవాటులేదు. ఆ పనిచేసే వాళ్ళను చూస్తే నాకు రోతకూడాను! ఆపని ఎటువంటి ఉద్రేకంలో చేశానో నేనిప్పుడు చెప్పలేను. నేను కుర్చీలో కూర్చుని చదువుకుంటున్నాను. రాజ్యంవచ్చి నా చదువు భంగం చెయ్యసాగింది. పైకి కనబడనిచ్చేవాణ్ణికాను గాని దాని అల్లరి నాకు చాలా యిష్టంగా వుండేది. ఆ సంగతి గ్రహించినదానల్లేనే రాజ్యం నేను కసిరితే లక్ష్యం చేసేదికాదు. ఆ రోజున నేను దాన్ని కసరలేదుకూడాను. పుస్తకం మీదినించి దానికేసి కళ్ళు పెద్దవిచేసి చూశాను. రాజ్యం చప్పున దగ్గిరికివచ్చి నా వీపుమీద చెయ్యివేసి 'నేను పెద్ద దాన్నయి నీ అంత చదువొచ్చి ఇట్లాగే చదువుకునేటప్పుడు, నన్ను ఇట్లాగే

ఏడిపిస్తావా?' అని అడిగింది - కేవలమూ పసితనంవల్ల అన్నట్టుగాని, కావాలని అన్నట్టుగాని కాకుండా.

ఆ క్షణంలో నాకు చెప్పతరంగాని ఉద్రేకం ఒకటి వచ్చేసింది. అమాంతం దాన్ని అవలీలగా ఎత్తి ఒళ్ళో కూర్చోబెట్టుకుని చెంప ముద్దుపెట్టుకున్నాను. మరుక్షణం నా ప్రతినరమూ ముడుచుకు పోయినట్టయిపోయింది. ఏదో మహాపాపం చేసినట్టు పశ్చాత్తాపంలో మునిగిపోయినాను. ఇక రాజ్యం ఎన్నటికీ నన్ను మామూలుగా చూడదనుకున్నాను. అది బతికి ఉన్నంతకాలమూ దాని మనస్సులో ఇది నన్ను గురించిన కళంకంగా నిలిచి ఉంటుందనుకున్నాను. అది ఈ విషయం ఏమాటల సందర్భంలోనో మొగుడితోకూడా చెప్పేస్తుంది. కొద్దికాలంలో రాజ్యం ఈ సంఘటన మర్చిపోతుందేమోనని ఒక క్షణకాలం వెర్రి ఆశ కలిగింది కాని మరు క్షణమే అది అడుగంటింది. రాజ్యానికి పదినిండినై. అమాయకురాలైనా కాదు.

అయితే నాకాశ్చర్యం కలిగించిన విషయం ఏమంటే, రాజ్యం నన్ను కొత్తగా చూడలేదు. వెనుకటి మోస్తరుగానే ఉంది. 'నువునన్ను ముద్దుపెట్టు కొన్న సంగతి నేను మరిచిపోలేదులే!' అన్నట్టయినా అది ప్రవర్తించలేదు. నాగుండె కుదటబడ్డది. అది మా ఇద్దరిమధ్యా ఒక రహస్యం. ఇక దాన్నిగురించి మూడో ప్రాణికి తెలియదని రూఢి చేసుకున్నాను.

రాజ్యం స్కూలుఫైనలు పాసుకాగానే దాని పెళ్ళి విషయం ప్రయత్నిస్తా నన్నాను. అది అంగీకరించలేదు. తనకు పెళ్ళి వద్దంటే వద్దన్నది, చదువుకుంటా నన్నది. ఏదైనా ఉద్యోగం చేస్తానన్నది.

'అయోమయంగా మాట్లాడకు, రాజ్యం. సహజమైన ఆడదానికి మొగుడు లేకుండా జరగదు. నీకిప్పటికే యీడుమించింది. మొగుడక్కర్లేదంటే నువు అవ్యక్తంగా ప్రవర్తించటానికి సిద్ధపడుతున్నా వనుకోవలసివస్తుంది. లేదా సహజమైన ఆడదానివి కావనుకోవలసి వస్తుంది. ఏది అనుకున్నా నాకు కష్టం గానే ఉంటుంది.' అన్నాను.

రాజ్యం చదువుకుంటున్న కొద్దీ దానితో గంభీరవిషయాలు స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం నాకు లభించింది. ఆ ధోరణిలోనే ఇప్పటి విషయం కూడా ప్రస్తావించాను. రాజ్యం కోపగించలేదు, నవ్వలేదు, గంభీరంగా 'నువ్వెప్పుడన్నా అవ్యక్తంగా ప్రవర్తించావా, మామయ్యా!' అని అడిగింది.

నేను కంగారుపడి, 'లేదు! ఎన్నడూలేదు! ఎప్పుడో చిన్నతనంలో ఒక సారి - అదికూడా చెప్పకోదగిన విషయంకాదు. ప్రమాదం జరక్కముందే కళ్ళుతెరిచి - ' అని తడువుకుంటూ ప్రారంభించాను.

రాజ్యం నాకడ్డంవచ్చి 'అప్పటికి నీకు పెళ్ళి అయిందా?' అన్నది.

'నాకుచాలా చిన్నతనంలోనే అయింది పెళ్ళి. నీమాదిరిగా కాదు—'

'అత్తయ్య కాపరానికి వచ్చిందా?'

'వచ్చే ఉంటుంది! అదికాదు నేననేది—'

రాజ్యం ఇక మాట్లాడదగిన విషయం పూర్తి అయినట్టుగా లేచి తన పని మీద వెళ్ళబోతూ మళ్ళీ ఆగి, 'ఆ అవ్యక్తత విషయంలో ఎప్పుడన్నా మన స్ఫూర్తిగా పశ్చాత్తాప పడ్డావా?' అన్నది.

నా నోట మాట రాలేదు.

మళ్ళీ నేను రాజ్యంతో దాని పెళ్ళి విషయం ఎత్తలేదు.

ఈ నాలుగు సంవత్సరాలూ అది లేని కొరత నాకు బాగా కనిపించింది. రాజ్యం కాలేజిలో ప్రవేశించటానికి వెళ్ళిపోగానే నేను మళ్ళీ మామూలు ప్రపంచంలో పడ్డట్టయింది. గృహచ్ఛిద్రాలను పరిష్కరించుకోవటమే పరమార్థంగా పెట్టుకున్న నా భార్యా నేనూ మిగిలాం. ఒక మంచి పుస్తకం చదివి పూర్తిచేసి మూసినట్టయింది. రాజ్యం దగ్గర్నుంచి ఎప్పుడన్నా ఒక ఉత్తరం వస్తే ఆ పుస్తకం మళ్ళీ తెరిచి అక్కడక్కడా వాక్యాలు చదివి మొదటి పఠనానుభవం స్ఫురణకు తెచ్చుకున్నట్టు అయ్యేది.

కిందటిసారి శెలవులకు వచ్చినప్పుడు మా సంభాషణలో ఒక కొత్త అంశం వచ్చింది. ముందుగా నేనే రాజ్యాన్ని కెలికాను — 'ఏమే రాజ్యం, అవ్యక్తపు మనిషి వవుతున్నావా? అసహజమైన మనిషి వవుతున్నావా?' అన్నాను.

రాజ్యం కొద్దిగా మందహాసం చేస్తూ 'నేను అసహజమైన దాన్ని కాను మామయ్యా!' అన్నది.

ఆ మాటకు నేను కంపించిపోతూ 'కొంపతీసి ఏం చేస్తున్నా వేమిటి?' అన్నాను. రాజ్యం మాట్లాడలేదు.

ఇప్పటికే మే మిద్దరమూ ఔచిత్య భంగం అయేటంత సంభాషణ చేశాం. కాని, నా ఆదుర్దా నన్ను, నోరు మూసుకోనివ్వలేదు. నేను బతిమాలుతూ 'రాజ్యం తొందరపడి అవివేకమైన పనులు చెయ్యకు. నాకు నిన్ను గురించి అది ఒకటే దిగులు.' అన్నాను.

'ఏం చేస్తావు, మామయ్యా? నీ ప్రవర్తన నీ యిష్టాయిష్టాల మీదే ఆధారపడి ఉంటుందా? ఎవరో వచ్చి సోది పెట్టుకు కూర్చుంటే నువ్వేం చేస్తున్నావు, చెప్పు. 'నీ సోది నాకు తల నొప్పిగా ఉంది. చాలించి నీ దారిన నీవు పో' అనగలవా?'

'అదా ఉపమానం?' అన్నాను నిర్ఘాంతపోయి.

'ఎందుకు కాదూ? ఎవడో వచ్చి నా కోసం చచ్చిపోతున్నానంటాడు. నేను మొగ్గేవరకూ నన్ను విడవడు. ఏమిటి చెయ్యటం?'

'నీ కోసం చస్తున్నా నన్నవాడి మాటల్లా నమ్ముతావా?'

'నిన్ను చూసి జాలి పడుతున్నట్టు కనపడే వాళ్ళందరితోనూ పోట్లాడతావా? నిన్ను చూసి ఇతరులు జాలిపడదగిన స్థితిలో ఉండటం నీ దురదృష్టం. ఆడతనమూ, యవ్వనమూ నా దురదృష్టం!' అన్నది రాజ్యం. 'అది ఒక బాధ్యత. ఇతర బాధ్యతల మాదిరిగానే ఇది కూడా నిర్వర్తించటం కష్టం. ఏదో ఒక పొరబాటు జరిగి తీరుతుంది. అత్యద్భుతంగా నిర్వర్తించగల మనుకునేటందుకు లేదు.'

'అట్లా మనస్సును సమాధాన పరుచుకుంటే నీ ఆత్మగౌరవం మాటేమిటి? నీకు నీతిలో నమ్మకం లేదా? నాకిప్పటివాళ్ళ లేకితనాలు నచ్చవు, రాజ్యం. నేను ముసలివాణ్ణి' అన్నాను.

'నేను పడుచుదాన్ని. నాకు నిజంగానే నీతిలో నమ్మకం లేదు. నీతికంటే చాలా ముఖ్యమైనవి జీవితంలో ఉన్నట్టు అదివరకే నిర్ధారణ చేసుకున్నాను. అయితే, నాకు ఉన్న లేకితనమూ అసహ్యమే. నేను అవినీతిని ఆరాధించను. ఇక ఆత్మ గౌరమూ, పవిత్రతా అంటావా? దీర్ఘంగా ఆలోచిస్తే అవి అణిచిపెట్టిన అహంకారాతిశయాలు గాని ఇంకేమీ కావు .... ఏమిటాలోచిస్తున్నావు?' అన్నది రాజ్యం.

'ఏమీ లేదు. నిన్ని చదువులో పెట్టి పాడుచేశానా అనుకుంటున్నాను. నీకిటువంటి విశ్వాసాలు కలగటం నా కెంత కష్టంగా ఉందో నేను ఊహించనైనా లేను. నా బాధ నిన్ను చీమ తలకాయంతయినా అంటుతుందనే ఆశతో ఆ మాట అంటున్నాను.'

రాజ్యం దీనంగా నవ్వి 'చీమ తలకాయంత కాదు, కండచీమ మోస్తరుగా పట్టుకుంటుంది. నీ కటువంటి బాధ కలగకుండా ఉండేటందుకే నిష్కల్మషంగా నా మనస్సు విప్పి చెబుతున్నాను - చేతయినంత వరకు, ఒక్కటి అర్థం చేసుకో, మామయ్యా. భగవంతుడు ఒక్కొక్క మనిషిని ఒక్కొక్క విధంగా పుట్టిస్తాడని నీకు నమ్మకం ఉందా? అయితే ఆ భగవంతుడు నాకు నీతి గీత గియ్యకుండా పుట్టించాడు. నేను భూమిమీద పడక పూర్వమే నాకు నీతితో సంబంధంలేకుండా ఏర్పాటు జరిగింది. దేవతలు నాకు కావలిసిన పువ్వులన్నీ పోగుచేసి ముళ్ళకంచెల మీద పెట్టి ఆ ముళ్ళ కంచెల చుట్టూ ఊబి కల్పించారు. అంతకన్న నేనేమీ చెప్పలేను. వాటిని సంపాదించగలిగానా ఒళ్ళంతా బురద అవుతుంది, గీసుకు

పోయి రక్తం కారుతుంది, కాని జన్మ సార్థకం అవుతుంది. లేదూ - నా జన్మ నిరర్థకం అవుతుంది.'

రాజ్యం మాట్లాడుతుంటే నా కేదో మైకం కమ్మినట్టు కాసాగింది. నల్ల మందు పొగలు చుట్టవేసినట్టయింది. ఈ పొగలలోనించి పుస్తకాల్లో ఉన్మాదులైన కథకులు చిత్రించే అసజమైన ప్రపంచం అస్పష్టంగా కనిపిస్తున్నది. పుస్తకాలు చదివి పాడైన రాజ్యం నన్నా మాయ ప్రపంచంలోకి తీసుకుపోవటానికి ప్రయత్నిస్తున్నది. నేను పోను, ఈ మైకాన్ని విదిల్చేస్తాను.

'నీ మాటలకు అర్థం లేదు. ఏదో మాట్లాడుతున్నావు - అంతే! నీకు వెర్రివరికం రావటం నిజంగా అక్రమమే ననుకో. కాని, దానివల్ల బాధపడటం నీ తప్పే. నువ్వెందుకు పెళ్ళి చేసుకోవూ? ఇద్దరు పిల్లల్ని కంటే ఈ పైత్యమంతా దిగిపోతుంది. కాదనకు - నువు మాట్లాడేది కేవలమూ పైత్య ధోరణి."

రాజ్యం మళ్ళీ నవ్వింది. అది నన్ను చూసి నవ్వుతున్నదా అనిపించింది నాకు.

'నీకు ప్రేమలో నమ్మకం లేదా?' అన్నది రాజ్యం.

'ప్రేమ! ప్రేమ! షెల్లీ, కీట్సు చదివిన ప్రతి మనిషికీ అన్నం కంటె అత్యవసరంగా ముందు ప్రేమ కావాలి! ఎక్కడుందా ప్రేమ? దేవుడున్నాడనటం మూఢ విశ్వాసమూ, ప్రేమ ఉందనుకోవటం నాగరికతా! నాకూ కావాలి లక్ష రూపాయలు. ఏవీ?' అని గట్టిగా అన్నాను.

రాజ్యం ఓర్పుతో, 'అంటే నీకు ప్రేమలో నమ్మకం ఉన్నట్టా, లేనట్టా?' అన్నది.

'నాకు లేదు! నీకూ లేదూ? ఏవో కలలు కంటున్నావు. నే నటువంటి కలలు కనటం మానేసి ఇరవై సంవత్సరాలైంది. నలభై ఏళ్ళు వచ్చి నేను నేర్చుకున్నదేమిటంటే - మనిషి కామం తీర్చుకోవటంలో పప్పులో కాలు వెయ్యకుండా ఉంటే అదే పదివేలు! నాయీడు వచ్చిన తరవాత నీకు అదే తెలుస్తుంది.'

రాజ్యం నవ్వి, 'మధ్య వయస్సంటూ లేకుండా నేను పసితనంనించి నడి వయస్సులో పడి నీ మాదిరిగా మాట్లాడగలిగితే ఎంత బాగుండేది?' అన్నది.

'అయితే ప్రేమ అంటే నీకూ అంత ఘనమైన అభిప్రాయం లేదన్న మాటే!' అన్నాను.

'ఉంది! లేకుండా ఉంటే మనస్సుకు శాంతి ఉంటుందని! ఏ పని చేస్తున్నా నీ కళ్ళ యెదుట, నీ వయస్సులో, నీ గుండెలో, నీ నెత్తురులో ఒక మనిషి ప్రత్యక్షమై ఉండటం ఎంత బాధ! ఆ మనిషి జ్ఞాపకం రాగానే నీ కళ్ళ వెంట

నీరు కారటం ఎంత ఇబ్బంది! ప్రపంచంలో ఆ ఒకడే మనిషి అనిపించటం ఎంత గుడ్డితనం!'

'ఎవడది?'

'ఎవరైనాను!' అన్నది రాజ్యం నిర్లక్ష్యంగా.

'వట్టి కవిత్వం!'

'కావచ్చు. కవిత్వం అబద్ధమా?'

ఈ సంభాషణ పోయినకొద్దీ అన్యాయమవుతుం దనిపించింది. ఇదంతా ఎట్లా ఉపసంహరించాలో తెలియలేదు.

'నీ ప్రేమను విరవటానికి మంచి ఉపాయం చెప్పనా?' అన్నాను.

'తప్పకుండా చెప్పు. ఇది దాదాపు జబ్బుగా పరిణమించింది.' అన్నది రాజ్యం.

'అయితే విను. నువు ప్రేమించిన మనిషిని పెళ్లాడెయ్యి.'

'అట్టా ప్రేమను చంపటానికి నాకు చేతులు రావు. ఇంకేదన్నా చెప్పు.'

'అయితే నువు ప్రేమించినవాడు కూడా మామూలు మనిషే అని తెలుసుకో—'

'నాకు తెలుసును.'

'వాణ్ణి పులి తరుముతున్నట్టు ఊహించుకో. బురదలో జారిపడిలేస్తున్నట్టు ఊహించుకో. గురక పెడుతున్నట్టు - ఎందుకల్లా నవ్వుతున్నావు?'

'నీకు సెన్సు ఆఫ్ హ్యూమరు లేదు మామయ్యా!'

'నాకా?' అన్నాడు రోషంగా.

రాజ్యం మళ్ళా నవ్వులో పొర్లిపోయింది.

'మొత్తంమీద చాలా మోసం జరిగింది. నువు నే నెరిగిన రాజ్యానివే కాదు, ముఖ్యంగా నే నాలోచిస్తున్నదేమంటే, ముందుముందు ఆడపిల్లలందరినీ చదువవేసి నీమాదిరిగా తయారుచేస్తే ప్రపంచం ఏమవుతుందా అని! చదువుకున్న ఆడవాళ్ళూ మగవాళ్ళూ కూర్చుని ప్రతి పిచ్చి ముక్కకూ వెకవెకలాడటం ఆదివరకే చూశాను. కాని అది వాళ్ళలో తూకం లేకపోవట మనుకున్నాను. నువు కూడా ఆ జాతిలోనే చేరితే ఈ వెకిలితనం చదువులోనే ఉదయించుకోవాలి. నీవంటి వాళ్ళు వందమంది కంటే మీ అత్తయ్య ఒకతె నయం!' అన్నాను.

రాజ్యం ఒకచెంప కళ్ళు తుడుచుకుంటూ రోషం నటిస్తూ 'అంత తలవాచే టట్టు పెట్టేవాడివి ఎందుకు నవ్వించావేమిటి?' అన్నది.

'సరే అయితే చెప్పు. దేనికి నవ్వావు? నేను నిజంగా అడుగుతున్నాను సుమా!'

'నేను ప్రేమించినవాడే వచ్చి 'నన్ను పెద్దపులి తరిమినట్టు ఊహించుకో!' అన్నట్టయితే ఆ మనిషిమీద నాకున్న ప్రేమ ఎట్లా విజృంభిస్తుందో ఆలోచించుకో.'

'నీ ప్ప్రేమ!' అన్నాను పళ్ళు బిగబట్టి.

'మాటలు చూసి భయపడకు మరి—అందరినీ తేలిక మనుష్యుల కింద కట్టే బరువయిన మనిషివి!' అన్నది రాజ్యం కొంటెగా.

అంతటితో ఆ అయోమయపు సంభాషణ అయిపోయింది. అది అన్నట్టు నాలో సెన్సు ఆఫ్ హ్యూమరు కాకపోయినా ఏదో సెన్సు లోపించింది. జరిగిన సంభాషణకు పడదగిన పశ్చాత్తాపమంతా పడ్డ తరవాత అదికూడా ఒకవిధంగా మంచిదే అయిందని స్ఫురించింది. ఏమంటే, అంత సేపు ఉన్మాదంగా మాట్లాడినా, గంభీరంగా రంకుతనాన్నీ, అవినీతినీ సమర్థించటం మొదలుపెట్టిన రాజ్యాన్ని నవ్వించగలిగాను; మామూలు మనిషిని చెయ్యగలిగాను. ఈ సంగతి నాకప్పుడే ఎందుకు తట్టలేదూ?

ఇది కిందటి సంవత్సరం జరిగిన సంగతి, మేమిద్దరమూ మళ్ళీ అటువంటి సంభాషణలో పడలేదు. ఇది మా ఇద్దరి మధ్యనే నిలిచిపోయిన రెండో రహస్యం.

మా మూడో రహస్యాన్ని గురించి చెప్పటానికి నాకు భాషలేదు, చిత్రించటానికి శిల్పం చాలదు. నేను మొదట్లో చెప్పిన ఉత్తరం అందిన సాయంకాలం బండిలో రాజ్యం దిగింది. అది దిగిన క్షణంనించీ ఆరాత్రి అఖరయ్యేవరకూ జరిగిన సంగతులు ఈ ప్రపంచానికి సంబంధించినవిగా తోచవు. నేను, నాది అనుకునే ప్రకృతికి ఏమీ అందులో పాలులేదు. భగవంతు డనేవాడుంటే అట్లా జరిగి ఉండదేమో!

అది నా ఆదర్శాల మధ్య పిడుగుపడ్డట్టు పడింది. చిత్రమేమిటంటే, రాజ్యం కనపడిన క్షణంనించీ నా అంతరాత్మ 'ఏదో జరగబోతున్నది. జాగ్రత్త!' అని సూచిస్తూనే ఉంది. అసలు మే మిద్దరమూ ఈసారి ఒకరివంక ఒకరం సూటిగా చూసుకోలేకపోయినాం. దానితో మాట్లాడాలంటే నాగొంతు బరువెక్కినట్టయిపోసాగింది. రాజ్యం నాకు రెండడుగుల దూరంలోకి వస్తే ఊపిరి పూర్తిగా బిగబట్టి ఒకక్షణం ఉండి గట్టిగా విడవటం మొదలుపెట్టింది. మేమిద్దరమూ మాట్లాడుకోవటం మొదలుపెడితే ఒకప్పుడు గంటలెల్లా గడిచినయ్యో ఇప్పుడు క్షణాలంతకన్న భారంగా గడవసాగినై. నన్నెవరో ఊదర పెట్టినట్టయింది. రాజ్యంకూడా అట్లాగే భావిస్తున్నదని నే నూహించగలిగాను.

ఈ ఊదర నించి తప్పించుకుపోవటం ఎట్లా? ఇంటో నా భార్య అయినా

లేదు. 'ఎందుకిట్లా అవుతున్నాను? ఇంత కాలానికి నాకూతురితో సమానమైన రాజ్యంమీద నాకు కామోద్రేకం కలుగుతున్నదా?' అని కోపంగా ప్రశ్నించుకున్నాను. ఎవరు సమాధానం చెబుతారు? అర్థంలేని ప్రవాహాన పడి కొట్టుకుపోతుంటే విమర్శించిపెట్టేవా రెవరు?

అది రాజ్యంమీద ప్రేమకాదు. నాకు ప్రేమానుభవం ఎన్నడూ కాలేదు కాని ఇది ప్రేమకాదని గుర్తించాను. ఇది ప్రేమ అయితే ప్రతి ప్రాణీ ప్రేమించగలదు. నాలో ఆ క్షణాన మానవత్వం ఏమీలేదు. నా ఉద్రేకం కట్టలుతెగి రాజ్యాన్ని నిర్మూలించటానికి చూస్తున్నది కాని పవిత్రం చెయ్యటానికి చూడటం లేదు. అటువంటి ఉద్రేకం నేను యవ్వనంలోకూడా యెరగననిపించింది. నే నింతకాలమూ అభ్యసించిన నిగ్రహానికి మరోరూ మరోరూ కాకుండా రాజ్యమా బలి! ఇది నాకు ప్రకృతి వేసిన శిక్షా? ఈ సంఘటనలో ఆధ్యాత్మికమైన గుణపాఠం ఉందా?

ఆ క్షణంలో రాజ్యం మనస్సు నా కర్థమైతే ఎంత బాగుండును? కాని కాలేదు. ఆ నిమిషంలో నాకు రాజ్యంకన్న దూరంగావున్నది మరేదీలేదు. నా ఊహ సరయితే నా ప్రతి కదలికలోనూ రాజ్యానికి రాక్షసత్వం కనిపించి ఉండాలి -ఆ క్షణాన అదికూడా రాక్షసి అయితే తప్ప!

రాజ్యం నన్ను అణుమాత్రమైనా ప్రతిఘటించలేదు. ఒకవేళ నాకు తెలియలేదో! తనలోపడి కొట్టుకుపోతున్నవాడు వాలునపడి వస్తున్నాడో, ఎదురీదడానికి ప్రయత్నిస్తున్నాడో వరదకేం తెలుస్తుంది?

నన్నావేశించిన పిశాచం వదలి తుఫాను సమసిపోయిన తరవాత నాస్థితి ఆలోచించుకుంటే నాకొక వింత విషయం అవగాహన అయింది. నేను భయంకర పాపమనుకుంటూ చేసిన ఈపని నా తత్వానికి సరిపోయింది. ఇందులో ఆనందమూ లేదు, బాధాలేదు. ఆనందమైనా బాధ అయినా నాకు అసహజమైన అనుభవాలనిపించేవి. ఈ అనుభవం తరవాత దీని ఫలితంగా ఏ వికారమూ లేదు. ఇక ఏదో వికారం నేనే పనిపెట్టుకొని తెచ్చిపెట్టుకోవాలి. నన్నిటువంటి పనులు చెయ్యమని పుట్టించా డా భగవంతుడు! కిందటి జన్మలో రాజ్యం నాతో అన్నమాటలేవో జ్ఞాపకం వచ్చినై!

ఇకముందు రాజ్యానికి నే నేమవుతాను? అది నా కేమవుతుంది? ఈ దుష్కార్యానికి శిక్షో ప్రతిఫలమో ఏమిటి? ఇటువంటి సమస్యలన్నీ కాలక్రమాన పరిష్కారం అవుతై. వాటినిగురించి ఆలోచించే త్రాణలేదు నా ఆత్మలో. నేను రాజ్యంకేసి చూడనన్నా లేదు.

అంధకారంలో జడుడిమాదిరిగా ఉన్న నాకు వెలుతురు కిరణం సాక్షాత్కరించినది. రాజ్యం నా పక్కనే వచ్చి కూర్చుని నా మెడ చుట్టూ చెయ్యివేసి "చూశావా, మామయ్యా! నాక్కూడా నీతి అనేది ఉంది!" అన్నది దాదాపు పరిహాసం గొంతుతో.

"నన్ను తిట్టదలిస్తే అంత నాజూగ్గా తిట్టనక్కరలేదు. నువ్వు యెంత మాట అన్నప్పటికీ ఆగ్రహించడానికి అధికారం లేకుండా చేసుకున్నాను."

రాజ్యం ఆదుర్దాగా నన్ను కుదిలిస్తూ "పశ్చాత్తాపపడటం మొదలుపెట్టి నా ఆనందమంతా పాడుచెయ్యకు." అని బతిమాలింది.

మొదట నా చెవులు నేనే నమ్మలేకపోయినాను. కాని మరుక్షణమే నాకు రాజ్యం స్వర్గంలో ఉన్నదని - ఉన్నా ననుకొంటున్నదని - అర్థమయింది. జీవితం పొరపాటున నాటకం మాదిరిగా అవుతుందేమోనని జీవితమల్లా భయపడిన నేను ఆ క్షణాన దేవుణ్ని ఉద్దేశించి 'చూశావురా, దేవుడా? నేను చేసిన పని రాజ్యం ఆమోదిస్తున్నది!' అని వెర్రికేక వేతామనుకున్నాను.

"నేను మొదటిసారి నిన్ను చూచిన క్షణంనించీ నిన్ను మిగతా ప్రపంచం నించి ఎడంచేసి రహస్యంగా దాచిపెట్టుకున్నాను. నా జీవితం ఏ గుట్టలెక్కినా, ఏ లోయల్లో పడిపోయినా సరే నేను చెయ్యిచాచి ఏ క్షణాన నిన్ను అందుకోలేక పోతే ఆ క్షణాన నా జీవితం తాొరపడి పోతుందనుకున్నాను. నా అభిప్రాయాలు ఎన్నో మారినై. ఇది మారలేదు. నేనేం చెయ్యను?

"మూడు నాలుగేళ్ళనించీ నీమీది అభిమానం అణిచి పెట్టటానికి వీల్లేని వాంఛగా మారింది. నేను ఎట్లా నిగ్రహించుకున్నానో తెలియదు. ఏ క్షణాన నువు నన్ను కౌగలించుకున్నా నేను నీ చేతుల్లో నీరైపోయి వుందును. వెనక ఒకసారి నన్ను ముద్దుపెట్టుకున్నావు. మళ్ళీ ముద్దుపెట్టుకుంటావని ఈ ఎనిమిది తొమ్మిది సంవత్సరాలనించీ ఎదురు చూస్తున్నాను.

"నీమీద పంచ ప్రాణాలూ పెట్టుకున్న నేను నీతిని ఎట్లా లక్ష్యం చెయ్యను? నీకేమో నీతిలో అంత నమ్మకం. నిన్ను ఆకర్షించటానికి ఎంత నిగ్గుమాలిన పని అయినా చేతామనిపించేది. కాని చెయ్యలేదు. నీ అంతట నువే మోక్షం ఇచ్చేవరకూ నేను చెయ్యీ కాలూ కదిలించ దలచలేదు. ఆ నిశ్చయం మీదే ఉన్నాను. నాకు తగిన నీతి నాకు మాత్రం లేదంటావా?"

ఎంత అందమైన మాటలు - నిజమైతే!

నన్నా అపనమ్మకం వదలదు! నేను స్వర్గ నరకాల చుట్టూ వెయ్యి ప్రదక్షిణాలు చేసి వచ్చినా సరే అది నా వెంట వుంటుంది. వెయ్యి మందిలో

ఒకడు అనిపించుకోని మాటలు ఆడదాని నోట అనిపించుకున్న తరవాత కూడా నా అపనమ్మకం నా వెంటే వుంటుంది! ధన్యుణ్ణి.

నా వ్యక్తిత్వం సార్థకం చేసుకునేటందుకు రాజ్యాన్ని హింసించాను! దాని కోరికను తృణీకరించి నా పశ్చాత్తాపం వెలిబుచ్చాను. ఇక ఇటువంటి పని ఎన్నడూ చెయ్యనని శపథం చేశాను! వెనుకటి మా పవిత్రమైన సంబంధం కళంకితమై పోయిందని వాపోయినాను!

దాని మాటలు నిజంగా అబద్ధం కాకపోతే నా మాటలు దాన్ని ఎట్లా హింసించేది నేను లెక్క చెయ్యలేదు. దాని ప్రాణం హింసపడటం కంటె నా అపనమ్మకమే నాకు ప్రియమైనది. దాని మాటలు నిజం కాదని నిరూపించటానికి లక్ష వాదాలు నా మనస్సులో పుట్టుకొచ్చినై!.......

రాజ్యం మనిషి కాదు, దేవత! అది ఒకప్పుడు తన వాంఛను ఎట్లా అణగదొక్కి పెట్టిందో ఇప్పుడు తన బాధను కూడా అట్లాగే అణగదొక్కి, నా మాటలన్నీ విని తలవంచుకుని "పోనీ మామయ్యా? నువ్వెందుకు పశ్చాత్తాప పడతావు? పాపిష్ఠిదాన్ని నేనే! నా మూలంగానే నువు గోతిలో పడ్డావు. నేను సమయానికి నివారించగలిగితే నువు మేలుకునే వాడివి. నేనదివరకే చెడి పోయినాను కనుక నాకు ఫరవాలేదు. ఇప్పటికైనా నీ మనస్సు తెగబడి ఏదన్నా కోరితే నేను ఏ విధమైన అభ్యంతరమూ చెప్పను. నీకు నావల్ల ఏం కావాలంటే అది నిశ్చింతగా తీసుకో. నా బుద్ధికి మాత్రం మన వెనకటి సంబంధం ఏమీ మారినట్టులేదు. నీ బుద్ధికి అట్లా తోచినప్పుడు మళ్ళీ వెనకటి పద్ధతికి పోదామని ప్రయత్నించకు. లాభం ఉండదు" అన్నది.

నా అంతరాత్మ జాలిపడ్డట్టు నటించింది. దాని మనస్సుకు శాంతి కలిగించే వాడల్లే నటిస్తూ, దాని దృష్టితో రాజీపడే వాడల్లే కనిపిస్తూ దాని శరీరం మళ్ళా నా స్వాధీనంలోకి తీసుకున్నాను నా మనస్సును మార్చుకోకుండా, నా ఉన్నతా దర్శాలు సంస్కరించుకోకుండా రాజ్యం ద్వారా కామోపశమనం చేసుకోవటానికి రోజుకొక నూతన మనః పరిణామం ప్రదర్శించుతూ వచ్చాను. ఈ విధంగా నేను రాజ్యాన్ని మరింత హింసించి ఉండాలి. కాని దాని నోటివెంట ఒక్క సాధింపుమాట రాలేదు. అందుకు నేను కృతజ్ఞత చూపలేదు. దాని నోటివెంట ఒక్క సంతోషకరమైన మాట కూడా రాలేదు. అది కూడా నేను గమనించ లేదు. నా కిప్పుడు స్మరించితే అనుమానం కలుగుతున్నది – ఆ రోజుల్లో రాజ్యం నవ్వినట్టు జ్ఞాపకం లేదు.

నా భార్యకు మళ్ళా ఆడపిల్ల కలిగినట్టు ఉత్తరం వచ్చింది. బారసాల

విషయం అశ్రద్ధ చేసినా శాంతి ఒకటి ఉంది కనక తప్పక రమ్మని రాయించింది నా భార్య. మర్నాడు పోవటానికి ప్రయాణం కట్టాను.

ఆ రోజు సాయంకాలం మా యింటికొక కుర్రవాడు వచ్చాడు. చిక్కి శల్యాకారంగా ఉన్నాడు పాపం. ఎవరు కావాలన్నాను. అతను సమాధానం ఏదో గొణిగి అటూ ఇటూ చూడసాగాడు. ఇంతలో రాజ్యం లోపలినించి వచ్చి అతన్ని చూస్తూనే పేరు పెట్టి పిలిచింది.

"ఒక్కమాట మాట్లాడి వెళ్ళిపోతాను. ఇక్కడ ఒక డాక్టరును చూసి పోదామని వచ్చాను. ఈ బండికి పట్నం వెళ్ళిపోతున్నాను." అన్నాడు ఆ కుర్రవాడు.

ఇద్దరూ కలిసి దొడ్డోకి వెళ్ళారు. ఆ ఇద్దరూ నా దృష్టిపథం దాటి పోగానే నాలో అసూయ అంకురించి భగ్గున మండి జ్వాలగా అయింది.

"ఇటువంటి ప్రియులు దీనికింకా ఎందరున్నారో? పాపం, తన్ను తానే మోసగించుకుంటున్నది. నడివయస్సు వాడిమీద దానికి ప్రేమ ఏమిటి?"

ఒక నిమిషానికి ఇద్దరూ లోపలికి వచ్చారు. కుఱ్ఱవాడు వెళ్ళిపోయినాడు. వాడి వాలకం చూస్తే మొహంలో మృత్యుదేవత తాండవిస్తున్నది. ఎటువంటి ప్రియుడు! అంతకంటె నేనే లక్షరెట్లు నయం!

"ఎవరతను?"

"ఒకప్పుడు నన్ను నిర్బంధించినవాడు. అతనిలో అంత మానవత్వం ఉందనుకోలేదు." అన్నది రాజ్యం పరధ్యానంగా.

"ఏం? ఏమంటాడు?"

"తనకు క్షయ ఉందని వైద్యులు నిర్ణయించారుట. నాకు చెప్పటానికి వచ్చాడు."

"జాగ్రత్త పడమనా?"

"ఊఁ!"

వాడి స్థితిలో నేనుండే అట్లా ప్రవర్తించేవాణ్ణా అని ప్రశ్నించుకున్నాను. ఆ తరాని కాతరం ప్రవర్తనలో నీతి ఒకవేళ జాస్తి అవుతున్నదేమో ననిపించింది. రానురాను స్త్రీ పురుష సంబంధం అట్లా అధో గతికి పోవటం దేనికి? నా కా సంబంధం సరిగా అర్థం కాలేదా?

నేను మా బావమరిదిగారి ఊరుకెళ్ళి రావటానికి పదిహేను రోజులు పట్టింది. ఈ పదిహేను రోజుల్లోనో రాజ్యం యొక్క నగ్న సౌందర్యం పదిహేను వందలసార్లు జ్ఞాపకం వచ్చింది. స్త్రీ పురుష సంబంధమైన నీతిని

గురించి నాకున్న ఖచ్చితమైన జ్ఞానం నా పురుషత్వాన్ని గురించి లేక పోవటం గ్రహించి కొంత ఆశ్చర్యపడ్డానుగాని నా మనస్సు ఆత్మపరీక్ష వైపు జాస్తిగా వెళ్ళలేదు.

ఆఖరుకు ఇంటికి బయలుదేరి రైలెక్కగానే దిక్కుమాలిన ఉద్రేకం ఒకటి పుట్టుకొచ్చింది. ఏ ఆదర్శం కోసమైనా సరే రాజ్యాన్ని వదిలి పెట్టటం నాకసంభవమని తెల్చుకున్నాను. రాజ్యం నాకు ఆత్మార్పణ కావటంలో ఉన్న గొప్పతనం నాకు అకస్మాత్తుగా అర్థమయినట్టయింది. నాలో కృతజ్ఞత మొలకెత్తింది.

రెక్కలు కట్టుకుని వచ్చిన వాడల్లే నేను ఇంటోవచ్చి వాలేటప్పటికి రాజ్యం సావిట్లో మంచం వేసుకుని పడుకుని ఉంది. దాని స్వరూపం చూడగానే నాకు కళ్ళు తిరిగిపోయినై. ఆనాడు ఆ కుఱ్ఱవాడి మొహాన ఏ మృత్యుదేవత గోచరించిందో ఆ మృత్యుదేవత ఈనాడు రాజ్యం మొహాన తాండవిస్తున్నది.

"రాజ్యం?" అన్నాను, వణుకుతున్న గొంతుతో, మోకాళ్ళు పట్టుతప్పి పోతునై్న.

"పిల్లా తల్లీ కులాసాగా ఉన్నారా?" అన్నది రాజ్యం హీనస్వరంతో.

"ఏమిటి ఇట్లా ఉన్నావు? నీకేమయింది? ఎన్నాళ్ళనించి? నీకెవరు తోడుగా ఉన్నారు? చెప్పు రాజ్యం!" అన్నాను.

"క్షయ! సందేహం లేదు. చాలా ప్రమాదకరమైనదని పట్నంలో వైద్యులు చెప్పారుట. ఉత్తరం రాశాడతను. పాపం, జీవచ్ఛవం!"

"నీకు? నీకూ అదే? ఇంతకాలం దాగి ఉండి ఇప్పుడు బయటపడ్డదా?"

"లేదు. అత నిక్కడికి వచ్చినప్పుడు–"

"ఏం చేశావు? మీరు ఒక్క నిమిషం కంటె మాట్లాడినట్లు లేదే?"

రాజ్యం మొహం పక్కకు తిప్పుకుని "ముద్దు పెట్టుకున్నాను." అన్నది పొడిదగ్గు దగ్గుతూ.

నా అవస్థ వర్ణనాతీతం. ఆ క్షణంలో నా ప్రపంచమంతా - సంప్రదాయ సిద్ధంగానూ చదువుతోనూ నాకు సంక్రమించిన సంస్కారమూ, నా విశ్వాసాలూ నేను గుర్తించిన విలువలూ– ఒక్కసారిగా తారుమారయినట్టయింది.

నా నోటివెంట మాటల ప్రవాహం బయలుదేరింది. నా కంటి వెంట నీటి ప్రవాహం కూడాను. ఏమి మాట్లాడానో, ఎట్లా మాట్లాడానో తెలియదు. దాని తాత్పర్యం ఏమంటే, నేను రాజ్యాన్ని విడిచి బతకలేను, నేను ఎనిమిదోయేట దాన్ని చూసినప్పటి నించీ దాన్ని ప్రేమిస్తూనే ఉన్నాను. నేను గుర్తించలేదు కాని అది మఱ్ఱి చెట్టల్లే దినదిన ప్రవర్ధమానమై నా జీవితాకాశాన్ని కప్పేస్తూ వస్తున్నది. నేను జ్ఞాపకం తెచ్చుకోగలిగితే నేను రాజ్యంతో అన్న ప్రతి మాటా,

దాన్ని గురించి చేసిన ప్రతి చిన్న ఆలోచనా ఆ పరిణామంలో సోపానాలే! నాకు నోటికి వచ్చిన భాషలో రాజ్యాన్ని క్షమాపణ వేడాను.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. దేశమంతటా తిప్పి ఎంత డబ్బయినా ఖర్చుచేసి రాజ్యాని కీవ్యాధి నయం చేస్తా నన్నాను. రాజ్యం తన కేవైద్యమూ అవసరం లేదన్నది పరుషంగా.

"ఎందుకు నేను బతకటం? నాకు బతకాలని లేదు. నా ఒంటో ప్రాణం ఉండగా నే నే వైద్యానికీ ఒప్పుకోను. కావలిస్తే నా శవానికి చికిత్స చేయించు." అన్నది రాజ్యం.

"ఇంతపని ఎందుకు చేశావు, రాజ్యం? ఆ అబ్బాయి నిన్ను జాగర్తగా ఉండమని రాపడ మేమిటి? నువ్వతన్ని ముద్దుపెట్టుకోవట మేమిటి? ఎందుకు చేశా వా పని?

"కృతజ్ఞత కొద్దీ! అటువంటి దేమీ నీ కర్థం కాదా?" అన్నది రాజ్యం, బలహీనంగా నవ్వుతూ.

నా కళ్ళకు రెండంగుళాల దూరంలో మెరుపు మెరిసినట్టయింది. అవును నా కర్థమయింది— మానవత్వం! నేను చప్పున రాజ్యం పడుకున్న మంచంపక్క మోకరించి దాని మొహం నా వైపుకు తిప్పుకుని వాడిపోయిన దాని మూతి దీర్ఘంగా ముద్దు పెట్టుకున్నాను.

"కృతజ్ఞత కొద్దీ! తెలిసిందా? కృతజ్ఞత కొద్దీ! నేను కూడా కృశించి నీ మాదిరిగా అయే వరకూ ఇట్లాగే ముద్దు పెట్టుకుంటాను. ఇహమూ, పరమూ కూడానూ! నీ పెదిమలు ఎప్పటంత తియ్యగానూ ఉన్నై. నా కేమీ తేడా కనిపించటం లేదు."

రాజ్యం మెరిసే కళ్ళతో నన్నొక క్షణం చూసి నా మొహం గట్టిగా తన మొహాని కదుముకుని, "భోజనం తెప్పించు, మామయ్యా! లేచి వంట చేసే ఓపిక లేదు" అన్నది. దాని మొహాన తాండవించిన మృత్యుదేవత ఏమయింది? దాని గొంతులోకి అంతజీవం ఎట్లా వచ్చింది? ఆ పొడిదగ్గే మయింది?

నా ఆశ్చర్యానికి రాజ్యం సమాధానం చెప్పింది.

"నే నా అబ్బాయిని ముద్దు పెట్టుకోలేదు. ప్రాణం పోయినా పెట్టుకుని ఉండను. రెండు మూడు రోజులనించీ కటిక లంఖణాలు చేస్తున్నాను.....ఉండు! అసలు దుర్వార్త అట్టే వుంది. నువు నాకు అబ్బాయిని కని యివ్వలేకపోయినావు నేనిస్తే పుచ్చుకుంటావా?" అన్నది రాజ్యం.

[ప్రథమ ముద్రణ : జూన్ 1940, భారతి]